
# దళితులకు సామాజిక న్యాయం దక్కేవరకు పోరాడదాం ....




## భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ

# దళితులకు సామాజిక న్యాయం దక్కేవరకు పోరాడదాం ...

**ప్రియమైన ప్రజలారా!**

మనదేశానికి స్వాతంత్రం వచ్చి 68సంవత్సరాలు అవుతున్నా దళితుల స్థితిగతుల్లో పెద్దగా మార్పు రాలేదు. అంటరాని తనం, దాడులు, స్త్రీలపై అత్యాచారాలు, మానభంగాలు కొనసాగుతూనే వున్నాయి. అందుచేతనే రాజ్యాంగ నిర్మాత భారత రత్న డా॥ బి.ఆర్.అంబేద్కర్ 125 జయంతి సందర్భంగా పార్లమెంటు ప్రత్యేక సమావేశం కనీసం నాలుగు రోజులు నిర్వహించి దళిత సమస్యలపై చర్చించి పరిష్కారానికి కొన్ని చట్టాలు రూపొందించాలని సిపియం డిమాండ్ చేస్తున్నది.

ప్రయివేటు రంగం రోజు రోజుకి పెరిగి పోతున్నది. నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రయివేటీకరణ జోరు మరింత పెంచుతున్నది. దీనివల్ల ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలు తగ్గిపోతున్నాయి. కనుక ప్రయివేటు రంగంలో దళితులకు రిజర్వేషన్లు కల్పించాలని అందుకు పార్లమెంటు వెంటనే చట్టం చేయాలని సిపియం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది.

ఆంధ్రప్రదేశ్‌లో దళిత సంఘాలు, రాజకీయ పార్టీలు ముఖ్యంగా సిపియం పార్టీ పోరాట ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం రూపొందించింది. ఇదే విధంగా కేంద్ర ప్రభుత్వం కూడా దేశవ్యాపిత ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం రూపొందించాలని సిపియం పార్టీ దేశవ్యాపితంగా ప్రచారం చేస్తున్నది. అదే విధంగా దళితుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భర్తీ చేయాలని సిపియం పార్టీ డిమాండ్ చేస్తున్నది.

మనదేశంలో వేలాది సంవత్సరాలుగా కొన్ని కులాల ప్రజలు సమాజంలో వెలివేయబడి ఊరికి దూరంగా, అంటరానితనంతో మగ్గుతున్నారు. తరాలు మారినా వీరి బ్రతుకులుమాత్రం మారడంలేదు. దేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంతో అభివృద్ధి

సాధించింది. మానవ రహిత రాకేట్లను మనదేశం ప్రయోగిస్తున్నది. అగ్ర రాజ్యాలతో శాస్త్ర సాంకేతిక రంగాల్లో పోటీ పడుతున్నది. కానీ మనదేశంలో కొన్ని కులాల ప్రజలను నేటికీ అంటరానివారిగా పరిగణిస్తూ ఆ ప్రజలపట్ల వివక్షత ప్రదర్శిస్తున్నారు. ఈ కులాల ప్రజలు అభివృద్ధికి ఆమడదూరంలో వున్నారు. నేటికీ అక్ష్యరాస్యతలో అగ్రకులాలతో పోలిస్తే వెనుకబడే వున్నారు. వీరు కాపురముంటున్న నివాసప్రాంతాలు, దళిత పల్లెలు మురికి కూపాలుగా దర్శనమిస్తాయి. ఊర్లో వర్షం కురిసిందంటే ఆ ఊరిలోని మురికి నీరంతా ఈ పల్లెలో వుండవలసిందే. అగ్రకుల పేటల్లో పక్కా సిమెంట్ రోడ్లు, మురికి నీరు పోవడానికి మురికి కాలువలు వుంటాయి. కానీ దళితపేటల్లో నేటికీ గతుకుల రోడ్లు దర్శనమిస్తుంటాయి. నూటికీ కోటికీ ఎక్కడో ఇటీవల దళితపేటల్లో సిమెంటు రోడ్లు కనిపిస్తున్నాయి. కానీ ఏ దళితపేట గాలించినా, రాష్ట్రంలో ఏ మారుమూల పల్లెకు పోయినా ఎక్కడా డ్రైనేజీ సౌకర్యం కనిపించదు. ఇదీ నేటికీ స్వతంత్ర్యం వచ్చి 68సంవత్సరాలు అవుతున్నా దళితుల దౌర్భాగ్య పరిస్థితి. అందుచేతనే అగ్ర కులాల ప్రజలతోపాటుగా దళిత ప్రజలు సమానంగా బ్రతకాలంటే దళితులకు సామాజికన్యాయం దక్కాలి. దళితులకు సామాజికన్యాయం దక్కేవరకు సిపియం పార్టీ పోరాడుతున్నది.

భారతదేశంలో వేలాది సంవత్సరాలుగా వర్ణవ్యవస్థ, కులవ్యవస్థ రాజ్యమేలుతున్నది. ఆదిమ సమాజ కాలంలో మాత్రమే మనుషులందరూ పరస్పరం సహకరించుకుంటూ ఎటువంటి దోపిడీ లేకుండా, సామాజిక తేడాలు లేకుండా ఐక్యంగా, సమానంగా జీవనం సాగించారు. ఉత్పత్తి అభివృద్ధి చెందేకొద్దీ జనాభా పెరుగుతున్న క్రమంలో వృత్తులు కూడా అభివృద్ధి చెందాయి. అడవులను నరికి గ్రామాలు వెల్లి విరిసాయి. ఈ క్రమంలోనే ఆదిమసమాజం విచ్ఛిన్నమై వర్ణ వ్యవస్థ ఏర్పడింది. వర్ణ వ్యవస్థ అనగా మనిషిని మనిషి సమానంగా చూడలేని అనాగరిక వ్యవస్థ. అగ్రవర్ణ దురహంకారంతో దాసులను, సూద్రులను వర్ణవ్యవస్థ పేరుతో దోపిడీ చేసిన మొట్టమొదటి దోపిడీ వ్యవస్థయే వర్ణవ్యవస్థ.

భారత సమాజంలో వర్ణ వ్యవస్థ మనుషులమధ్య చీలికలుతెచ్చింది. ఏ మాత్రం శ్రమచేయని, కష్టపడని అగ్రకుల సోమరులు నిరంతరం గొడ్డుల్లా శ్రమిస్తున్నా సూద్రుల శ్రమను కాజేశారు. మేము బ్రాహ్మణులమని కాయాకష్టం చేయకుండగా బొజ్జలు నింపుకు బ్రతకమని ఆ బ్రహ్మే సృషించాడని సుద్దులు చెప్పి దేవుని పేరుతో సూద్రవర్ణ ప్రజలను దోపిడీ చేశారు.

రాజ్య పాలకులుగా రాజు రాజ్యాన్ని పాలించే పేరుతో విలాసవంతమైన జీవితం గడుపుతూ విచ్చలవిడి శృంగారంతో మదమెక్కి వీరి విలాసాలకు, ఆచారాలకు రాజ్య అవసరాలకు సూద్రులను దోపిడీ చేసి దోపిడీ వ్యవస్థకు పట్టం కట్టిన వర్ణం క్షత్రియ వర్ణమే. విలాసాలు రాజులకు అగ్రస్థానం బ్రాహ్మణులకు. అవమానాలుశిక్షలు మాత్రం సూద్రులకు. రెక్కలకష్టం సూద్రులదే. కానీ అనుభవించడం పై వర్గాలకు చెల్లుతుంది. నాడు వ్యవసాయమే ప్రధాన వృత్తిగా పెట్టుకుని వ్యవసాయం సాగుచేస్తూ సూద్రులను పనివాళ్ళు గా ఉపయోగించుకొని వారి శ్రమను కాజేసిన మరొకవర్గం వైశ్యులే. సూద్రులతో పగలనకా, రేయి అనకా పశువులతో సమానంగా పనిచేయించి వారి రెక్కల కష్టాన్ని, శ్రమ ఫలితాన్ని దోచుకున్న వైశ్యులు. మరొక వర్ణం. ఈ మూడు వర్ణాలు శూద్రులను దోచుకుంటున్నాయి. ఎదురు తిరిగిన శూద్రులను బ్రహ్మ ఈ విధంగా సృష్టించాడని దేవుని పేరు చెప్పి జోకొట్టారు. ఈ విధంగా వర్ణ వ్యవస్థ పేరుతో దోపిడీ వ్యవస్థ కొనసాగింది.

కాలం గడిచినకొద్దీ ఉత్పత్తి అభివృద్ధి అవుతున్నకొద్దీ, చేతివృత్తులు శాఖలుగా, శాఖోపశాఖలుగా విస్తరిస్తున్న క్రమంలో వర్ణ వ్యవస్థ కులవ్యవస్థగా రూపుదిద్దుకుంది. వర్ణ వ్యవస్థలో ఒక్క సూద్రులే దోపిడీకి గురయ్యేవారు. కానీ నేటి కుల సమాజంలో శూద్ర కులాల్లో కొన్ని కులాలు అగ్ర కులాలుగా మార్పుచెంది చేతివృత్తిదార్లను, దళితులను అన్ని విధాలా వీరంతా విపరీతంగా దోచుకుంటున్నారు. మనుధర్మ సిద్ధాంతం పేరుతో సూద్రులకు, పంచమ కులస్థులకు విద్య అందుబాటులో లేకుండా చేశారు. పంచమ కులస్థులు మైలబడ్డ పనులు చేస్తున్నారని, మళినమైన పనులతో జీవనం సాగిస్తున్నారు. కనుక వీరిని అంటుకోరాదని, తాకరాదని అంటరానితనాన్ని పాటిస్తూ వీరిని ఊరికి దూరంగా నెట్టారు. వేలాది సంవత్సరాలుగా నాటినుండి నేటివరకు ఊరికి దూరంగా అంటరానితనంతో అస్పృశ్యులుగా బ్రతుకులీడుస్తున్నారు. నాటినుండి నేటికి వరకు కూడా వీరి జీవన విధానంలో పెద్దగా మార్పులేదు. వీరి జీవన విధానంలో మార్పు రాకుండా అగ్ర కులాలతో సమానంగా వీరి బ్రతుకులు మారనంత కాలం వీరికి సామాజిక న్యాయం లభించదు. కనుకనే దళితులకు సామాజిక న్యాయంకోసం సిపియం పార్టీ పోరాడుతున్నది. ప్రజాస్వామ్యవాదులంతా కలిసి రావాలని కోరుతున్నాం.

## సామాజిక వివక్ష అంటే ఏమిటి?

రోజువారి జీవనంలో దళితులు, మైనారిటీలు, మహిళలు, ప్రత్యేక ప్రతిభావంతులు, మరియు గిరిజనులు సామాజిక వివక్షతకు గురౌతున్నారు. చేతి వృత్తులు

చేసి బ్రతుకుతున్న వృత్తిదార్లు, వెనుకబడిన కులాల ప్రజలు కూడా వివక్షతకు గురౌతూనేఉన్నారు.

**వివక్ష అంటే ఏమిటి :** వివక్ష అనగా కొంతమంది వ్యక్తులను, కొన్ని బృందాలను, కొన్ని కులాల ప్రజలను రోజువారీ సామాజిక జీవనంలో పూర్తిగా గానీ లేదా పాక్షికంగా గానీ అందరితోపాటు పాలుపంచుకోకుండా దూరంగా వుంచే ధోరణియే వివక్ష. ఇందులో అందరిలోకన్నా ఎక్కువగా వివక్షకు గురౌతున్నవారు దళితులే.

వివక్ష అనేక రూపాల్లో నేటికీ కొనసాగుతున్నది. దళిత కులాలైన మాల, మాదిగ, రెల్లి మొదలగు 59 కులాల ప్రజలు నేటికీ అంటరానితనంతో బ్రతుకుతున్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డా॥బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగ చట్టాన్ని పార్లమెంటు ఆమోదించింది. చట్టంముందు అందరూ సమానులేనని ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ కాదని రాజ్యాంగం ఆదేశించింది. ఎవరిపట్ల అయినా వివక్ష అంటరానితనం పాటిస్తే ప్రదర్శిస్తే వారిని కఠినంగా శిక్షించమని కానీ చట్టం చెబుతున్నా నేటికీ అనేక రూపాల్లో వివక్ష యథేశ్చగా అమలు జరుగుతూనే వున్నది. నిన్నటివరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాజధానిగా ఉన్న హైదరాబాద్‌లోనే కొన్ని ప్రాంతాలలో దళితుడంటే అద్దెకు ఇళ్ళు ఇవ్వని పరిస్థితి మన కళ్ళముందు కనిపించింది. నేడు విజయవాడ వంటి పట్టణంలో కూడా దళితులకు అద్దెకు ఇండ్లు దొరకడంలేదంటే మనమంతా సిగ్గుపడాలి. కూలీ – నాలీ చేసుకునే వ్యక్తులకే కాదు ఈ పరిస్థితి. అగ్ర కులాల వ్యక్తులకు ధీటుగా చదువులు చదువుకొని పెద్ద ఉద్యోగాలు చేసే దళితులకు కూడా ఈ పరిస్థితి ఉంది. అంటరానితనం ఎవరు పాటించానా శిక్షించవలసింది పోలీసులే. కానీ అటువంటి పోలీసు ఇన్‌స్పెక్టర్లకే దళితుడనే పేరుతో అగ్ర వర్ణ బ్రాహ్మణులుండే నివాసప్రాంతాలలో ఇండ్లు ఖాళీగా వున్నా అద్దెకివ్వలేదంటే చట్టం సిగ్గుతో తలవంచుకుంది తప్ప ఏ చర్య తీసుకోలేకపోయింది. ఇది ఎక్కడో కాదు ఎంతో అభివృద్ధి చెందిన తూర్పు గోదావరి జిల్లా కేంద్రమైన కాకినాడ నగరంలోనే ఈ ఘటన జరిగింది. ఈ విధంగా అనేక పట్టణాల్లో జరుగుతున్నాయి. ఇదీ నేటికి నగ్నంగా కనిపిస్తున్న వివక్ష.

ఆ గ్రామంలో పబ్లిక్ కుళాయిద్వారా త్రాగునీరు సరఫరా చేస్తారు. అగ్ర కులాలవారికి సరిపడినంతగా నీరు ఇస్తారు. కానీ దళితులకు మాత్రం నీరుచుక్క అందదు. అగ్ర కులాల వీధుల్లో బావులుంటాయి. దళితులకు కొన్ని చోట్ల బావులున్నా ఆ బావుల్లో నీరు పూర్తిగా పాడైపోయి త్రాగడానికి పనికిరాదు. కానీ అగ్రకుల బావులనుండి దళితులు నేటికీ నీరు తోడుకోకూడదు. పొరపాటున నీరు తోడితే వారి వీపు విమానం మోతే.

ఎందుకు మమ్ముల్ని కొట్టారు అని ప్రశ్నిస్తే వీరిని ఆ ఊరినుండి వెలివేయడం జరుగుతున్నది. ఇది మరొక తరహా వివక్ష.

అగ్రకుల భూస్వాముల ఆధిపత్యంలో వున్న ఆ గ్రామంలో అగ్రకుల భూస్వాములున్న వీధిలో దళితులకు ప్రవేశం లేదు. ఆ వీధిలో దళితులు నడవకూడదు. వీరుగనుక నడిస్తే ఆ వీధే మైలబడుతుందట పొరపాటున ఎవరైనా నడిస్తే వారిని స్తంబానికి కట్టి కొట్టిన ఘటనలు కూడా అనేకం మన కళ్ళముందు కనబడుటున్నాయి. ప్రభుత్వం వేసిన రోడ్లు అందరికీ చెందుతాయి అనేది ఇక్కడ అమలు కావడంలేదు.

ఆ ఊరిలో దేవుడి గుడిని అగ్ర కులస్థుల ఆధ్వర్యంలో నిర్మిస్తున్నారు. గోతులు త్రవ్వి, మట్టిని తీసేది దళితులే. గోడలుకట్టి, ఆలయ నిర్మాణంలో శ్రమను ధారబోసేది దళితులే. కానీ గుడిలో దేవుడిని (రాతి విగ్రహాన్ని) నెలకొల్పిన తర్వాత ఆ దేవున్ని చూడడానికి మాత్రం దళితులకు అనుమతిలేదు. దళితుడు చూస్తే దేవుడు మైలబడిపోతాడట. మట్టిని తీసినప్పుడు లేని మైలు దేవున్ని చూడడానికి ఎందుకు వచ్చిందో ఎవరికీ అర్థం కాదు. దళితులు మట్టినితీసి గుడినికట్టినప్పుడే గుడి మైలబడిపోయి వుండాలికదా! అనే విచక్షణ ఆ గ్రామంలో ఉన్న అగ్రకుల పెద్దల బుర్రలకు తట్టదు. ఇది నేడు కొనసాగుతున్న దేవునిపేరుతో వివక్ష.

ఏ గ్రామంచూసినా అగ్ర కులాలకు దూరంగా ఊరికి చివరగా దళిత పేటలుంటాయి. అగ్ర వర్ణాల వారు ఆ పేట మీదుగా వెలితే కుక్కి మంచాలమీద ఉన్నవాళ్ళు కూడా లేచి నిలబడాల్సిందే. కానీ వీరినీడ అగ్ర వర్ణాలపై పడకూడదు. దళితులను అంటరానివారిగా చూస్తూ ఊరికి దూరంగా నెడుతున్నారు. దళితులు చనిపోతే దళిత స్మశానాల్లోనే పూడ్చాలి తప్ప మరెక్కడా పూడ్చకూడదు. కానీ అంటరాని తనం పేరుతో దళితులను అంటుకోని అగ్ర కుల భూస్వాములు, ధనికరైతులు దళితులను పూడ్చిపెడుతున్న స్మశానాలుమాత్రం భూ బకాసురుల్లా ఆక్రమించుకుంటున్నారు. ఇది ఒక తరహా వివక్ష.

వారి పొలాలను దున్నేది దళితులే. వారి గొడ్డూ గోదాలకు తిండి పెట్టేది దళితులే. దళితుడితో పాటుగా దళితుడి భార్య కూడా గొడ్డు చాకిరి చేయాల్సిందే. పట్ట పగలు అంటరాని స్త్రీగా చూసిన అగ్రకుల భూస్వామే చీకటి పడే సరికి సొంగలార్చుకుంటూ చీర పట్టుకొనే దౌర్భాగ్యపు పరిస్థితి నేటికి అక్కడక్కడా గ్రామాల్లో కనిపిస్తున్నది. ఎదురుతిరిగిన దళిత స్త్రీని మానభంగం చేస్తారు. దళిత స్త్రీని అంటరానిదానిగా చూసే అగ్రకుల భూస్వామి, దళిత స్త్రీని మానభంగం చేసేటప్పుడు ఎందుకు అంటరానితనం

గుర్తుకురాదో మరి. ఈ విధంగా నేటికీ సమాజంలో వివిధ రకాలుగా దళితులు వివక్షకు గురౌతూనే వున్నారు.

దళితుల్లో ఎంతో కొంత అక్షరాస్యత పెరిగింది. చదువుకున్న యువతీ, యువకులు అంటరాని తనానికి వ్యతిరేకంగా నిలబడుతున్నారు. గతంలో ఒక దళిత యువకుడి తండ్రి ఆ గ్రామంలో పాలేరుగా వున్నప్పుడు ఒరే, ఒసే అనే పిలుపును వారి తల్లి తండ్రులు భరించినా నేటి యువతరం ఆ పిలుపులపట్ల ఉద్రేకులవుతున్నారు. ఇటువంటి పిలుపులు పోవాలని నిలదీస్తున్నారు. అగ్ర కులాలవారిని ప్రశ్నిస్తున్నారు. దళిత యువకులు అగ్ర కులాలవారిని ప్రశ్నించడం అగ్రకుల భూస్వాములు సహించలేక దళితులపై దాడులు చేస్తున్నారు. ఘోరంగా కొట్టి, హింసిస్తున్నారు. రాక్షస మూకల్లా పల్లెలపై పడి మారణకాండ సృష్టిస్తున్నారు. ముక్కలు ముక్కలుగా నరికి గోనె సంచుల్లో కట్టి కాలువల్లో పారేస్తున్నారు. ఇదీ నేటి దళితుల దుస్థితి.

మన రాష్ట్రంలో కారంచేడు, చుండూరు, నీరుకొండ, పదిరికుప్పం, లక్ష్మింపేటలలో అగ్రకుల భూస్వాములు దళితులను వేటాడి వేటాడి చంపివేసారు. ఒకప్పుడు కృష్ణాజిల్లా, కంచికచెర్లలో దళిత యువకుడు కోటేసును అగ్రకుల భూస్వాములు సజీవంగా దహనంచేస్తే యావత్ ఆంధ్రప్రదేశ్ అట్టుడికి పోయింది. ప్రభుత్వం కూడా తీవ్రంగా స్పందించింది. కానీ నేడు జరుగుతున్న ఘోర కృత్యల పట్ల ప్రభుత్వం తగినంతగా స్పందించడంలేదు. గత కాంగ్రెస్, తెలుగుదేశం ప్రభుత్వాల పాలనలో దాడులను చేసిన గూండాలకే రక్షణ కల్పించి ఆశ్రయమిస్తున్న ఘటనలు మన కళ్ళముందు కనబడుతున్నాయి. లక్ష్మిం పేటలో ప్రధాన ముద్దాయిగా వున్న బొత్సా వాసుదేవరావును నాటి కాంగ్రెస్ పాలకులే దాచారంటే సభ్య సమాజం సిగ్గుతో తలదించుకోవాలి.

మన రాష్ట్రంలోనే కాదు. దేశంలోకూడా ప్రతీరోజు అనునిత్యం అనేక ఘోర ఘటనలు జరుగుతున్నాయి. ఇటీవలనే మహారాష్ట్రలో శిరిడిలో ఒక దళిత యువకుడు తన సెల్‌ఫోన్‌లో డా॥ బి.ఆర్. అంబేద్కర్ పాటను రింగ్‌టోన్‌గా పెట్టుకున్నందుకు ఆగ్రహించిన అగ్రకుల దురహంకారులు దారణంగా కొట్టి చంపారు. ఉత్తరప్రదేశ్‌లో దళిత యువతి నీడ అగ్ర కుల యువతిపై నీడ పడిందని దారుణంగా కొట్టింది. అంతెందుకు దళితుల భూమిని ఆక్రమించుకున్న అగ్రకుల భూస్వాములను ప్రశ్నించినందుకుగానూ నలుగురు దళితులను అమానుషంగా హత్యచేశారు. తమిళనాడులో దళిత యువకుడు అగ్రకుల భూస్వామి పొలంగట్టుమీద నడిచినందుకు గానూ తండ్రీ కొడుకులు కలిపి దారుణంగా కొట్టి చంపారు.

మన రాష్ట్రంలో దళిత యువకుల చైతన్యం చూసి ఓర్వలేక తప్పుడు కేసులు బనాయించి దొంగతనం, ఆపాదించి, హత్యజేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా అల్లవరంలో ఒక మాదిగ యువకున్ని అగ్రకుల భూస్వాములు దొంగతనం నేరం ఆపాదించి దారుణంగా కొట్టి చంపారు. అభివృద్ధిలో ఎంతో ముందున్న అమలాపురం మండలం వన్నె చింతలపూడి గ్రామం వివక్షలో కూడా అంతే ముందుంది. ఇంటర్‌మీడియట్ చదువుకున్న దళిత యువకుడు అగ్రకుల క్షత్రియ అమ్మాయికి ఫోన్‌చేసాడనే నేరం ఆరోపించి చెట్టుకు కట్టి దారుణంగా చిత్రవధ చేశారు. దళిత యువకున్ని కొట్టిన క్షత్రియ కులస్థులను కఠినంగా శిక్షించవలసిన పోలీసులు ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక కేసు బనాయించడానికే వెనుకాడారు. పోరాడితే తప్ప కేసు రిజిష్టర్ చేయలేదు. ఇదీ నేటి దళితులయొక్క దౌర్భాగ్య పరిస్థితి.

**దాడులు పెరుగుదల :** మొత్తంగా దేశంలో దళితులపై దాడులు పెరుగుతున్నాయే తప్ప తగ్గడంలేదు. నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో ప్రకారం గతంతో పోలిస్తే దాడులు 17% పెరిగాయి. 2011లో 39,401 కేసులు రిజిష్టర్ కాగా 2012లో 39,512 కేసులు రిజిష్టర్ అయ్యాయి. 2013 వచ్చేసరికి 46,114కి పెరిగింది. ఈ దాడులు ఎక్కువగా బిజెపి పాలిత రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, రాజస్థాన్ మరియు సమాజ్‌వాది పాలనలో వున్న ఉత్తరప్రదేశ్‌లోనే ఎక్కువగా దాడులు జరుగుతున్నాయి. మన రాష్ట్రంలో 1991 లెక్కల ప్రకారం 690కేసులు రిజిష్టర్ అయ్యాయి. వామపక్ష పార్టీలు పాలించిన పశ్చిమబెంగాల్‌లో మాత్రం కేవలం 9 కేసులు మాత్రమే రిజిష్టర్ అయ్యాయి. దళితులపై అగ్రకులాలు దాడులు చేసినా, కులం పేరుతో దూషించి అవమానకరంగా ప్రవర్తించినా, దళిత స్త్రీల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా షెడ్యూల్డ్ కులాల, తెగల అత్యాచార, నిరోధక చట్టంక్రింద కేసులు పెట్టి కఠినంగా శిక్షించాలి. కానీ అగ్రకుల భూస్వాములు, పెత్తందార్లు, రాజకీయ నాయకులు, పాలక పార్టీ పెద్దమనుషులు పోలీసులపై వత్తిడితెచ్చి కేసు నీరుగారేటట్టు చూసుకుంటున్నారు. లంచగొండి అధికారులు కూడా కాసులకు కక్కుర్తిపడి కేసు జారిపోయే విధంగా చార్జ్‌షీట్ దాఖలు చేస్తున్నారు. దళితుల రక్షణకు చట్టం వున్నా ఉపయోగం లేకుండా నేటికి వివక్షతకు గురవుతున్నారు. ఇటీవల యు.పి.ఏ. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాన్ని సవరించి కొన్ని పటిష్టమైన సూచనలు ఆమోదించింది. ఈ చట్టాన్ని వెంటనే నరేంద్రమోడీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించి దళితులకు రక్షణ కల్పించాలని సిపియం డిమాండ్ చేస్తున్నది.

దాడుల స్వభావం గనుక పరిశీలిస్తే సరాసరి ప్రతి సవంత్సరం 2,000మందికి

పైగా దళితులు హత్యగావించబడుతున్నారు. దాడులవల్ల తీవ్రంగా గాయాల పాలవుతున్న దళితులు ప్రతి సంవత్సరం 4,500 పైగానే వుంటున్నారు. ప్రతి సంవత్సరం దాదాపు 3,000లకు పైగా దళిత స్త్రీలు అతి ఘోరంగా మానభంగాలకి గురవుతున్నారు. అగ్ర కులాలు దళితుల గుడిసెలను తగలబెట్టి వారికి నిలువు నీడ లేకుండా చేసి వారి నివాసాల నుండి కూడా బయటకి నెట్టి వేస్తున్నవారి కుటుంబాల సంఖ్య వేలలో వున్నది. ఈ విధంగా నేటికి దళితులు అనేక రకాలుగా వివక్షతకు గురవుతున్నారు.

సమాజంలో వేలాది సంవత్సరాలుగా దళితులు వివక్షతను అనుభవిస్తున్నారంటే భూస్వామ్య సమాజంలో ఏర్పడ్డ కుల వ్యవస్తే కారణం. మనదేశంలో కుల వ్యవస్థకు పునాది హిందూ మతం. కుల వ్యవస్థను చట్టబద్దంచేసింది మను ధర్మశాస్త్రం. మను ధర్మశాస్త్రం ఏయే కులాలు, ఏయే వృత్తులు చేపట్టాలి, ఆయా కులాలు పాటించవలసిన ధర్మాలను గూర్చికూడా పేర్కొనడం జరిగింది. దళితులను, మహిళలను మనుధర్మశాస్త్రం అతి నీచంగా వర్ణించింది. అంటరానివాళ్లను అత్యంత హీనంగా పరిగణించింది. చెండాలుడు (నేటి దళితుడు) శవాలమీద వేసే బట్టలు మాత్రమే కట్టుకోవాలి. నూతన వస్త్రాలను ధరించకూడదు. కుండ పెంకుల్లోనే అన్నం తినాలి. ఇనుప ముక్కలను నగలుగా ధరించాలి.(10వ అధ్యాయం 204 శ్లోకం) అదేవిధంగా స్త్రీని మరింత తక్కువగా చూడడం జరిగింది. చిన్నతనంలో తండ్రి సంరక్షణలో, యవ్వనంలో భర్త అధీనంలో, వృద్ధాప్యంలో కొడుకు సంరక్షణలో వుండాలే తప్ప స్త్రీ స్వతంత్రురాలు కాదు అని చెప్పింది. నేటికీ ఇవి కొంత మంది చాదస్తులు అక్షరాలా పాటిస్తున్నారు. వేలాది సంవత్సరాలుగా శూద్రులు, మహిళలు అస్పృశ్యులను విద్యకి దూరం చేసారు. వేద అధ్యాయనం కేవలం బ్రాహ్మణ, క్షత్రియులకే పరిమితం చేశారు. వీరు వేదాలు చదివేటప్పుడు పై ముగ్గురు వినినట్లయితే వారి చెవుల్లో సీసం పోయాలి. పొరపాటున గనుక వారు వేదాలు ఉచ్చరిస్తే వారి నాలుకను కోయాలి. ఇది నాటి అమలులో వున్న మనుధర్మ శాస్త్రం. అందుచేతనే ఊరికి దూరంగా, అంటరానితనంతో మగ్గుతున్న అస్పృశ్యులు ఒక మాటలో చెప్పాలంటే బానిసలుకన్నా హీనంగా చూడడం జరిగింది. కనుకనే వీరు విద్యకు దూరంగా, మౌళిక వసతులకు దూరంగా బ్రతకడం జరిగింది. కాలక్రమంలో సమాజంలో అనేక మార్పులు చోటుచేసుకున్న తరువాత కొన్ని సంస్థానాల్లో అక్కడక్కడ దళితులకు పాఠశాలలో ప్రవేశం కల్పించారు. అయినా వీరు తోటి అగ్రకుల విద్యార్థులతో సమానంగా కూర్చునే అర్హత మాత్రం లేదు. బ్రిటీష్‌వారు మనదేశాన్ని పాలిస్తున్న కాలంలో కొంతమంది దళితులను క్రైస్తవ మతంలో చేర్చుకొని వీరికి విద్య, వైద్య సౌకర్యాలు కల్పించారు.

వీరికన్నా ముందుగా ముస్లింల పాలన కాలంలో (మొగలాయుల కాలంలో) అంటరానికులాలను ముస్లిం మతంలో చేర్చుకొని వీరికి విద్యనందించి సామాజిక హోదా కల్పించడం జరిగింది తప్ప హిందూమతం ఆ పని చేయలేదు. నేటికి హిందూమతం దళితులపట్ల తీవ్ర వివక్షతను చూపుతూ వర్ణ వ్యవస్థను కొనియాడుతున్నది. దీనికి వ్యతిరేకంగా దళితులు ఉద్యమించాలి.

తర తరాలుగా ఇటువంటి అవమానాలు ఎదుర్కొన్న దళితులు వివిధ రూపాల్లో తిరుగుబాటు చేయడం జరిగింది. అంటరాని కులంలో పుట్టి అనేక అవమానాలకు గురై పెద్ద చదువులు చదివి అనేక డిగ్రీలు చేతపట్టిన భారత రత్న డా॥ బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగంలో అగ్ర కులాలతో పాటుగా అంటరానివారికి అన్ని విషయాల్లో సమాన హక్కులు కల్పించడం జరిగింది. విద్య, ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించి దళితులు దళితుల విద్యాభివృద్ధికి ఎనలేని కృషి సల్పారు.

**ఇళ్ళ కొరత :** నిలువ నీడలేని దళిత కుటుంబాలు నీటికీ రాష్ట్రంలో 13లక్షలున్నాయి. పట్టణాల్లో ఇళ్ళ కొరత చాలా తీవ్రంగా వుంది. పట్టణాల్లో 7లక్షల కుటుంబాలకు కనీసం నిలువ నీడలేకుండా వున్నారు. దళితులకోసం ఎంతో గొప్పగా ప్రకటనలు చేస్తున్నా పాలకులు ఆచరణలో మాత్రం వారి సమస్యలు పరిష్కరించడంలేదు. పట్టణాల్లో మరియు మండలానికి 5కిలోమీటర్ల పరిధిలో ఇళ్ళ స్థలాలు ఇవ్వరాదని గత ప్రభుత్వం జి.వో విడుదల చేయడం జరిగింది. ఇండ్ల స్థలాలు ఇచ్చేటప్పుడు 50% దళితులకిచ్చేవారు. కానీ నేడు ఇండ్ల స్థలాల బదులు రాజీవ్ గృహకల్ప అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నారు. ఈ అపార్ట్‌మెంట్లలో దళితులకు రిజర్వేషన్లు లేకపోవడంతో ఇండ్లు లేనివారి సంఖ్య పెరుగుతూనే వున్నది. అగ్ర కులస్థులు దళితులకు అద్దె ఇళ్ళు ఇవ్వక పోవడం వలన వారు మురికి కూపంలో మగ్గుతున్నారు. అంతేకాదు చిన్న గుడిసెలో కూడా రెండేసి కాపురాలుంటున్న గుడిసెలు వేలాదిగా వున్నాయి. కావున గ్రామల్లో, పట్టణాల్లో ఇండ్లు లేని దళితులందరికీ ఇళ్లస్థలాలు ఇచ్చి పక్కా ఇళ్ళు నిర్మాణం చేపట్టాలి.

**వ్యక్తిగత మరుగుదొడ్లు :** నేటకీ వ్యక్తిగత మరుగుదొడ్లు లేని దళిత కుటుంబాలు దాదాపు 35లక్షలు వరకు వున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మరుగుదొడ్లు లేక దళిత మహిళలు పడుతున్న అగచాట్లు అనేకం. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.12,000 మంజూరు చేస్తున్నది. కానీ నిలవ నీడలేని కుటుంబాలకు వ్యక్తిగత మరుగుదొడ్లు కట్టుకోవడానికి స్థలమేది? ఒకవేళ చిన్న పూరిగుడిసె వున్నా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించడానికి అవకాశంలేదు. కానీ దళితుల పేర్లతో అగ్ర

కులాలు వెనుకబడిన కులాల ప్రజలు వీటిని అనుభవిస్తున్నారు. కావున ప్రభుత్వమే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సులభ కాంప్లెక్స్ తరహాలో ఉమ్మడి కమ్యూనిటీ లెట్రిన్స్ నిర్మించి వాటికి నీటి సౌకర్యం కల్పించి దాని నిర్వహణకు ఒక ఉద్యోగిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నాము. యుద్ధప్రాతిపదికపై దళితులకు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలి. ప్రస్తుతం ఇస్తున్న రూ. 12,000లు పూర్తిగా సరిపోవడంలేదు. కావున దీనిని రూ. 20,000లకు ప్రభుత్వం పెంచాలి.

**రోడ్లు, డ్రైనేజి సౌకర్యం :** నేటికీ రోడ్లు, డ్రైనేజి సౌకర్యం లేని 40,000 పైబడి దళిత పేటలు వున్నాయి. దళితులకు పక్కా సిమెంట్ రోడ్లు నిర్మాణం చేస్తామని ప్రభుత్వం పదే పదే వాగ్దానం చేస్తున్నది. కొన్ని పేటలకు రోడ్లు మంజూరైతే దళిత పేటల్లో రోడ్లు వేయకుండా వాటిని అగ్రకుల వీధుల్లో వేయడం జరుగుతున్నది. దళిత సర్పంచ్ ఉన్న గ్రామాల్లో కూడా దళిత పేటలకు మంజూరైన రోడ్లు అగ్రకుల పేటలకు తరలిస్తున్నారంటే దళితులపట్ల ఎంత వివక్షత వుందో మనకు అర్థమవుతుంది. దాదాపు 40,000 దళిత పేటలకు రోడ్లు సౌకర్యంలేదు. వర్షం వస్తే అగ్రకుల నివాస ప్రాంతాలనుండి మురికి నీరు దళిత పేటలకు వచ్చి పడుతుంది. దళిత పేటల్లో ఎటువంటి డ్రైనేజి సౌకర్యం లేకపోవడంతో దళిత పేటలు మురికి కూపాలుగా మారుతున్నాయి. దళితులను అందలమెక్కిస్తామని పదే పదే ప్రగల్భాలు పలుకుతున్న పాలకులు కనీసం డ్రైనేజి కూడా ఏర్పాటు చేయలేకపోతున్నారంటే ప్రభుత్వం సిగ్గుతో తల వంచుకోవాలి. కావున తక్షణమే దళిత పేటల్లో సిమెంట్ రోడ్లు నిర్మించి డ్రైనేజి సౌకర్యం కల్పించాలి.

**స్మశానాలు :** దళితులకు నివాసం వుండడానికి ఇళ్లే కాదు, చనిపోతే పూడ్చడానికి కనీసం స్మశానం లేని గ్రామాలు మన రాష్ట్రంలో దాదాపు 3,000లకు పైగానే వున్నాయి. కొన్ని గ్రామాల్లో స్మశానాలు వున్నా అవి అగ్ర కుల భూస్వాముల ఆక్రమణలో వున్నాయి. దళితులను అస్పృస్యత పేరుతో ఊరికి దూరంగా వుంచే ఈ అగ్రకుల భూస్వాములు దళితుల స్మశానాలను మాత్రం అప్పణంగా ఆక్రమిస్తున్నారు. భూస్వాముల ఆధీనంలో వున్న స్మశానాలను బయటకు తీసి దళితులకు పంచాలని సిపియం పార్టీ ఎంతో కాలంగా డిమాండ్ చేస్తున్నా రెవెన్యూ అధికారులు వీరి గోడు పట్టించుకోవడంలేదు. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా వున్నప్పుడు దళితులకు స్మశానాలు లేవని అందువల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని అనేక సార్లు ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహించగా అప్పుడు జి.వో.నెం :1235 విడుదల చేసి స్మశానాలు లేని గ్రామాల్లో వెంటనే రెండు ఎకరాలు కొనుగోలుచేసి దళితులకు స్మశానాలు ఇవ్వాలని సూచించాడు. కానీ జి.వో.అయితే

ఇచ్చారు తప్ప దానికి కావాల్సిన నిధులు కేటాయించలేదు. నాటినుండి నేటివరకు మన రాష్ట్రంలో అనేక ముఖ్యమంత్రులు మారినా ఈ జి.వో.ను ఎవరూ పట్టించుకున్న పాపానికి పోలేదు. డెల్టా ప్రాంతంలో స్మశాన సమస్య చాలా తీవ్రంగా వుంది. ఏటిగట్ల ప్రక్కన, కాలువగట్ల మీద దళితుల శవాలను పూడ్చిపెట్టే ఘోరమైన పరిస్థితి నేటికీ వుంది. కావున వెంటనే ప్రభుత్వం స్మశానాలకు స్థలం కేటాయించాలి.

**దళిత ప్రజా ప్రతినిధుల పట్ల వివక్షత :** మన రాష్ట్రంలో దళిత ప్రజా ప్రతినిధులు కూడా వివక్షకు గురవుతున్నారు. స్థానిక సంస్థ ఎన్నికలలో అగ్ర కుల భూస్వాములు, రాజకీయ నాయకులు రిజర్వుడు స్థానాలలో వారి అనుకూల నోరులేని దళిత అభ్యర్థులను నిలబెట్టి గెలిపిస్తున్నారు. ఇందువల్ల ఎన్నికైన దళిత సర్పంచ్‌లను సర్పంచ్ స్థానాల్లో కూర్చోనివ్వకుండా ఉపసర్పంచ్‌లే సర్పంచ్ స్థానంలో కూర్చొని పాలన సాగిస్తున్నారు. దళిత మహిళ ప్రజా ప్రతినిధులైతే ఆఫీసుకే రాకుండా ఇంటి వద్దనే వుండమని సంతకాలు పెట్టించుకుంటున్నారు. శంఖు స్థాపనలు అధికార కార్యక్రమాల్లో దళిత సర్పంచ్‌లను, మండల అధ్యక్షులను దిష్టిబొమ్మల్లా పెట్టి తంతు అంతా అగ్ర కుల ప్రజా ప్రతినిధులే నిర్వహిస్తున్నారు. పంచాయితీలు, మండలాల్లో నిధులు ఏ విధంగా ఖర్చు చేయాలనే విషయం కూడా అగ్రకుల ప్రజా ప్రతినిధులే నిర్ణయిస్తున్నారంటే దళిత ప్రజా ప్రతినిధులు స్థానం ఏమిటో మనకర్థమవుతున్నది. కావున దళిత సర్పంచ్‌ల మండల అధ్యక్షుల పట్ల చూపుతున్న వివక్షతను దళిత సంఘాలు ఐక్యంగా ఎదుర్కోవాలి. ఈ విషయంలో కలిసొచ్చే రాజకీయ పార్టీల సహకారం కూడా తీసుకోవాలి.

**బడ్జెట్‌లో వాటా :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో కేటాయిస్తున్న ప్రణాళికా నిధులలో దళితుల జనాభా శాతాన్ని బట్టి నిధులు కేటాయించాలి. ఈ విధంగా ఎస్సీ కాంపోనెంట్ ప్లాన్ 1980నుండి అమలు జరుగుతుంది. కానీ నిధులు పేరుకు కేటాయిస్తున్నా దళితులకోసం ఖర్చు చేయకుండా పక్కదారి మళ్లించడం జరుగుతుంది. ఈ విధంగా 30 సంవత్సరాల కాలంలో కేంద్ర ప్రభుత్వం దాదాపు రూ.5లక్షలకోట్లు నిధులు దారి మళ్లించాయి. మన రాష్ట్రంలోకూడా దాదాపు 35వేల కోట్ల రూపాయలు నిధులు దారి మళ్లించారు. మనరాష్ట్రంలో దళితులు 16.2% వున్నారు. ఆ విధంగానే నిధులు కేటాయించాలి కానీ 16.2% కేటాయించకుండా తక్కువ కేటాయిస్తున్నారు. కేటాయించిన నిధులు కూడా పూర్తిగా ఖర్చు చేయకుండా సగం మాత్రమే ఖర్చు చేస్తున్నారు. ఈ ఖర్చు చేసిన నిధులలో కూడా దళితుల పేరుతో దళితయేతర్లకు ఖర్చు చేస్తున్నారు. కుల వివక్ష వ్యతిరేక పోరాటసంఘం, వ్యవసాయ కార్మికసంఘం, రాజకీయ పార్టీలు

ముఖ్యంగా సిపియం పార్టీ పోరాడిన ఫలితంగా మన రాష్ట్రంలో నిధులు ఖర్చు చేయడానికి రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం నోడల్ ఏజెన్సీని ఏర్పాటు చేయడం జరిగింది. కానీ చట్టం మాత్రం చేయలేదు. కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వం మాత్రం ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం ఆమోదించింది. నిధులు ఖర్చు చేయడానికి రూల్స్ రూపొందించాలని గత రెండు సంవత్సరాలనుండి ఆందోళనలు చేయగా చంద్రబాబు ప్రభుత్వం రూల్స్‌ని ఆమోదించింది. కానీ ఈ రూల్స్ ప్రకారం దళితులకు కొంతవరకు అన్యాయం జరుగుతుంది. దళితులకు కేటాయించిన నిధులలో 1/3 మూల వ్యయానికి తరలించాలని పేర్కొన్నారు. 7% ఉమ్మడి పనుల ఖర్చుల నిమిత్తం కేటాయించాలని చెప్పారు. ఏదైనా ఒక శాఖకు నిధులు కేటాయిస్తే ఆ శాఖ డిసెంబర్ 31వ తేదీలోగా ఖర్చు చేయకపోయినట్లయితే ఆ శాఖకు కేటాయించిన నిధులు వేరే శాఖకు బదిలీచేసే హక్కును నోడల్ కమిటీకి అప్పగించారు. అంటే ప్రభుత్వం కేటాయించినట్లే కేటాయించి తనకి ఇష్టం లేకపోతే ఖర్చు చేయకుండగా ఆపివేసి తను ఖర్చు చేయాలనుకున్న శాఖకు బదిలీచేసే అవకాశం వుంచుకున్నది. దీనివల్ల దళితులు కోరుకున్న విధంగా కాకుండా ప్రభుత్వం అనుకున్న ప్రకారమే ఖర్చు చేయడం జరుగుతుంది. నిధులు ఖర్చు చేసే విషయంలో అంబుడ్స్‌మన్ కమిటీని ఏర్పాటు చేయాలని ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు ఎంతగా డిమాండ్ చేసినా చంద్రబాబు ప్రభుత్వం అంగీకరించలేదు. 2011 జనాభా లెక్కల ప్రకారం దళితుల జనాభా 17.5% వుంది. దాని ప్రకారం నిధులు కేటాయించాలి. ఈ సంవత్సరం బడ్జెట్‌లో ఆ విధంగా కూడా కేటాయింపు జరగలేదు. నోడల్ ఏజెన్సీలో దళిత సంఘాల ప్రతినిధులకు స్థానం కల్పించలేదు.

బడ్జెట్‌లో దళితులకు కేటాయించిన నిధులనుండే కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే జనరల్ బడ్జెట్ నిధుల్లో కూడా దళితులకు కొంత డబ్బు కేటాయించి ఖర్చు చేయాలి. ఇవే కాకుండా జిల్లా పరిషత్‌లు, కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, మండల పరిషత్‌లు, గ్రామ పంచాయితీలకు వచ్చే నిధులు అన్ని రకాల ఆదాయాల్లో దళిత వాడల అభివృద్ధికి 16.2% ఖర్చు చేయాలి. ఆ విధంగా ఖర్చు చేయని అధికారులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని సిపియం నిలదీస్తున్నది. కానీ చంద్రబాబు ప్రభుత్వం రూల్స్‌లో పేర్కొన్నదేమిటంటే నిధులు ఖర్చు చేయని అధికారులకు పనిష్మెంట్ మాత్రమే ఇస్తామని చెప్పింది. ఇది సరిగాదు. నిధులు ఖర్చు చేయని అధికారులపై కఠినమైన చర్య తీసుకోవాలని సిపియం డిమాండ్ చేస్తున్నది.

దళిత యువతీ, యువకులు, చదువుకున్నవారు, అగ్రకులాల యువతీ,

యువకులతో పోలిస్తే తక్కువగా వున్నారు. కానీ దళిత యువతీ, యువకులను నిరుద్యోగ సమస్య వెంటాడుతున్నది. దళితులకు 15% ఉద్యోగాలు అన్ని కేటగిరిల్లోనూ కేటాయించాలి. కానీ గ్రూప్‌-ఏ ఉద్యోగాల్లో మాత్రం 10.15%తోనే భర్తీ చేశారు. గ్రూప్‌-బిలో 12.6%, గ్రూప్‌-సిలో 16.15%, గ్రూప్‌-డిలో 21.26% రిజర్వేషన్లు భర్తీ చేశారు. దేశంలోవున్న హైకోర్టులలో జడ్జీలు 544 మంది వుండగా దళితులకు చెందినవారు కేవలం 13మంది మాత్రమే వున్నారు. కాలేజీ, యూనివర్శిటీ ఉపాధ్యాయులలో కేవలం 2.6%మాత్రమే వున్నారు. బిల్ల బంట్రోతు (అటెండర్‌) ఉద్యోగాలు మాత్రమే పూర్తిగా భర్తీ చేస్తూ గెజిటెడ్‌ హోదా కలిగిన ఉద్యోగాల భర్తీలో దళితులకు న్యాయమైన వాటా దక్కకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయి.

1991నుండి మనదేశంలో ఉదారవాద విధానాలు అమలవుతున్నాయి. దీనివల్ల దళితుల సమస్యలు మరింతగా పెరిగాయి. ఉదారవాద విధానాలవల్ల ప్రభుత్వ రంగాన్ని చాలా వేగంగా ప్రయివేటీకరిస్తున్నారు. మోడీ ప్రభుత్వం ఈ సంవత్సరం సుమారు లక్షకోట్లు ప్రభుత్వరంగ పరిశ్రమలనుండి ఉపసంహరించుకొని పెట్టుబడిదార్లకు, బహుళజాతి సంస్థలకు వాటాలు ఇస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వ రంగంలో దళితులకు రావాల్సిన రిజర్వేషన్లు అమలు కాకుండా పోతున్నాయి. ఉద్యోగాలు తగ్గిపోతున్నాయి. ప్రభుత్వం కూడా ఉద్యోగాలు రిక్రూట్‌ చేయకుండా ఏళ్ళ తరబడి నిర్లక్ష్యం చేస్తున్నారు. దీనివల్ల బ్యాక్‌లాగ్‌ పోస్టులు పెరిగిపోతున్నాయి. బ్యాక్‌లాగ్‌ పోస్టులు నింపకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోస్టులు రద్దుచేయడంవల్ల దళిత యువతీ, యువకులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. కనుకనే ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) డిమాండ్‌ చేస్తున్నది.

సరళీకరణ విధానాల ఫలితంగా దళితులకు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి తీవ్రంగా తగ్గిపోయింది. సిపియం పార్టీ కృషి ఫలితంగా అమలు చేసిన ఉపాధి హామీ పథకాన్ని కూడా నరేంద్రమోడీ ప్రభుత్వం నీరుగారుస్తున్నది. దీనివల్ల దళితులకు పని దినాలు కోల్పోయి గతంలాగే వలసలు పునరావృతం అయ్యే ప్రమాదం ఏర్పడుతుంది. కావున ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించి, బడ్జెట్‌లో నిధులు పెంచి దళితులకు ఉపాధి అవకాశాలు పెంచాలని సిపియం పార్టీ పోరాడుతున్నది.

మనదేశంలో గత 68సంవత్సరాలుగా పాలిస్తున్న పెట్టుబడిదారీ భూస్వామ్య పార్టీలు కుల వ్యవస్థను, కుల అణచివేతను నిర్మూలించడంలో విఫలమయ్యాయి. దళితుల

కష్టాలు పెరుగుతూనే వున్నాయి. దళితుల్లో చైతన్యం పెరిగి వారి హక్కులకోసం పోరాడుతున్న కొద్దీ వారిపై అణచివేత మరింతగా పెరుగుతున్నది. దళితులు తమ హక్కులకోసం గట్టిగా పోరాటం చేయడం ఒక ప్రజాస్వామ్య హక్కు. వీరి పోరాటానికి సిపియం పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుంది.

కానీ దళితుల చైతన్యాన్ని ఓట్‌బ్యాంక్ రాజకీయాలుగా మార్చడానికి సంకుచిత దృక్పదంతో అనేక పార్టీలు, కుల సంఘాలు ప్రయత్నిస్తున్నాయి. ఉమ్మడి ప్రజాతంత్ర ఉద్యమంనుండి దళితులను వేరు చేయడానికి ఈ శక్తులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. కొన్ని స్వార్థపర రాజకీయ శక్తులు కులాల విభజనను తమ సంకుచిత రాజకీయ లక్ష్యాల సాధనకోసం వాడుకుంటున్నాయి. ఇందువల్ల దళితుల ప్రాథమిక సమస్యలైన భూమి, ఇండ్ల స్థలాలు, ఉపాధి, కుల అణచివేత, దాడులకు వ్యతిరేకంగా జరిగే పోరాటాన్ని విస్మరిస్తున్నాయి. ఈ సమస్యలపై పోరాటానికి సిపియం ముందుంటుందని దళితులకు సామాజిక న్యాయం దక్కే వరకు పోరాడుతుందని తెలియజేస్తున్నాం.

దళితుల అణచివేత కుల ఆధారిత రాజకీయాలకు వ్యతిరేకంగా పార్టీ జరిపే స్వతంత్ర ప్రచారానికి పోరాటాలకు ఎన్నికల అవసరాలను పరిగణలోనికి తీసుకోకుండా దళితుల పక్షాన నిలబడి పోరాడాలని సిపియం నిర్ణయించింది. దళితులకు ఉపశమనం కలగాలంటే రిజర్వేషన్లు అమలయ్యేలా సిపియం పోరాడుతుంది. కానీ ఒక్క రిజర్వేషన్ల వలనే దళితుల సమస్యలు పూర్తిగా తొలగిపోవు. మౌళికమైన సమస్యలు పరిష్కారం కావాలంటే వ్యవస్థ మార్పుకు కృషి చేయాలి. ఇది చేస్తూనే దళితుల హక్కుల అమలుకై సిపియం పోరాడుతుంది. దళితులు కుల వివక్షతను భరించలేక అవమానంగా భావించి కొంతమంది క్రైస్తవ మతంలోకి చేరుతున్నారు. అటువంటి దళిత క్రిష్టియన్లకు కూడా రిజర్వేషన్లు అమలు చేయాలని సిపియం పార్టీ డిమాండ్ చేస్తుంది. ప్రయివేటు రంగంలో రిజర్వేషన్ల అమలుకు సిపియం పోరాడుతూనే, తక్షణమే పార్లమెంట్‌లో చట్టం చేయాలని సిపియం డిమాండ్ చేస్తున్నది.

దళితులకు సామాజిక న్యాయం చేకూరడానికి ఈ క్రింది డిమాండ్లపై అందరూ కలిసి పోరాడాలని సిపియం కోరుతున్నది.

✸ ✸ ✸

## డిమాండ్స్ :

(1) భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డా॥ బి.ఆర్.అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా ప్రత్యేక పార్లమెంట్ సమావేశం జరిపి దళిత సమస్యలపై చర్చించి పరిష్కారానికి చట్టం చేయాలి.

(2) ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలి.

(3) దేశవ్యాపితంగా ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్‌చట్టం చేయాలి.

(4) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ,ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.

(5) సవరించిన ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాన్ని పార్లమెంటు వెంటనే ఆమోదించి అమలుచేయాలి.

(6) జస్టిస్ పున్నయ్య కమీషన్ సిఫార్సుల జీ.వో.21ని అమలు చేయాలి.

(7) దాడులు, అత్యాచారాలు, సాంఘీక బహిష్కరణలకు గురైన దళితులకు ఆర్థిక సహాయానికై బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయించాలి.

(8) కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులను అమలు చేయాలి. ప్రతి దళిత కుటుంబానికి 2ఎకరాలు మాగాని, 3ఎకరాల మెట్ట భూమి ఉచితంగా ఇచ్చి దళిత భూమి అభివృద్ధి పథకంలో చేర్చాలి.

(9) కోనసీమలో మరియు జిల్లాల్లో అనేకచోట్ల ప్రభుత్వ భూముల్లో వున్న కొబ్బరిచెట్లు భూమిలేని దళితులకే పంచాలి.

(10) దళిత కుటుంబాలకు 200రోజులు ఉపాధిహామీ పథకం పనులు కల్పించి రోజుకు రూ.250లు వేతనం ఇవ్వాలి.

(11) కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు లక్షరూపాయలు ఆర్థిక సహాయం అందజేసి ఉద్యోగాలలో ప్రాధాన్యత కల్పించాలి.

(12) దళిత క్రిష్టియన్లను ఎస్సీలుగా గుర్తించి రిజర్వేషన్లు అమలు చేయాలి.

వెల రూ. 3/-

సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ కార్యాలయం, 27-13-3, ఆకుల వారి వీధి, గవర్నర్‌పేట విజయవాడ - 2
ఫోన్ నెం. 0866 - 2577202, ప్రచురణ కర్త: పి.మధు, రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ(ఎం) పార్టీ, ఆంధ్రప్రదేశ్